# మరోమాట!

-ఉప్పల అనంత సుధాకర్

గత నాలుగు సంవత్సరాలుగా నేను రఘునాథ్ గారికి తెలుగు జ్యోతి పత్రిక ప్రచురణలో సహాయం చేస్తున్నాను. చాలా సార్లు పత్రిక పూర్తి భారం నాకే అప్పజెప్పారు. తను "మామాట" పేరుతో సంపాదకీయం వ్రాస్తూ నాకు "మరోమాట" వ్రాయమని ప్రోత్సహించేవారు. అందుకే ఈ మరో మాట!

తెలుగు జ్యోతి మాసపత్రిక రఘునాథ్ గారి మానస పుత్రిక. జ్యోతి అంటే ఎంతో మమకారం అతనికి. ఎన్ని పనులున్నా, ఎంత బిజీగా ఉన్నప్పుడికి తెలుగు జ్యోతికి కొంత సమయం తప్పనిసరిగా కేటాయించేవారు. వృత్తిరీత్యా బయట తిరుగు తున్నప్పుడు కూడా ఈ విషయంలో సమయం కేటాయించే వారు. హోటల్‌లలో, విమానాశ్రాయాలల్లో, విమాన ప్రయాణంలోనూ తన లాప్‌టాప్ పై - ఆర్టికల్సు టైపు చేస్తానని నాతో అనేవారు. అలాగే పేజ్ గెటప్‌కై ఒక స్టాండర్డ్ ఏర్పాటు చేసుకొన్నారు. ఎవరైనా టైప్‌డ్ ఆర్టికల్ పంపిస్తే ఈ పద్దతి పాటించాల్సిందే లేదంటే మాళ్ళీ ఫార్మాట్ చేయడమో, మళ్ళీ టైపు చేయడమో చేసేవారు. ఇలా ఎందుకు చేస్తున్నారని నేనొకసారి అడిగితే రఘునాథ్ గారిచ్చిన సమాధానం, "ఇలా ఫార్మాట్ చేయడం వల్ల, ఈ ఆర్టికల్‌ను ఒక అరపేజీ తగ్గించవచ్చు. మిగిల్చిన అరపేజీలో మరో చిన్న ఆర్టికల్ వేయవచ్చు. తెలుగు జ్యోతిలో ఉన్నవి నలభై పేజీలే. అడ్వర్టయిజ్ మెంట్లు వగైరా పోగా మనకు మిగిలింది ఇరవై పేజీలే. అందుకే మనం వీలైనంత సాహిత్యాన్ని ఈ ఇరవైపేజీల్లో పాఠకులకు అందజేయాలి." తెలుగు జ్యోతి పత్రిక చూస్తే ఈ విషయం మీకు తెలుస్తుంది. అలాగే జ్యోతిలో సినిమాల గురించికాని, మరేదైనా మసాలా ఆర్టికల్సు కాని వేయడానికి ససేమిరా అంగీకరించేవారు కాదు.

తెలుగు కళా సమితి స్థాపనలో ముఖ్యపాత్ర వహించిన రఘునాథ్ గారికి, తె.క.స. అంటే వల్లమాలిన అభిమానం. ఊర్లో ఉన్నట్లయితే తె.క.స. నిర్వహించే ప్రతి కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరయ్యేవారు. హాజరవడమే కాకుండా సలహాలివ్వడం, సహాయం చేయడం చేసేవారు. ఏ పని చేయడానికైనా వెనుకాడేవారు కాదు, ఉదాహరణకు, 2003 సంక్రాంతి పిల్లల కార్యక్రమం అప్పుడు, నేనేం చెయ్యాలి అని నన్నడిగారు. మెమెంటోలు, సర్టిఫికేట్లు పిల్లలకివ్వడం మీరుచూడండి, అని నేచెప్పాను. మూడున్నర గంటల పాటు స్టేజీ వెనకాల కూర్చుని ఓపికగా పిల్లలందరికీ ఇవి అందజేసారు. అలాగే, తె.క.స. కార్యక్రమాల సమయంలో రిజిస్ట్రేషన్ ప్రక్కన ఒక టేబుల్ వేసుకొని తెలుగు జ్యోతి పంపకం చెయ్యడం ద్వారా సంస్థకు కొంత డబ్బు ఆదా చేయడం, చిరునామా తప్పులను సరిదిద్దడం మనమంతా మరిచిపోలేని మరోవిషయం. రఘునాథ్ గారు అంతా తానే అయి, నిర్వహించే మరో కార్యక్రమం "త్రిమూర్తి డే". గత సంవత్సరం ఈ కార్యక్రమాన్ని నిర్వహణ విషయం చర్చించడానికై మీటింగ్‌కు పిలిచారు. అప్పుడు ప్రతిచిన్న విషయాన్ని పూర్తిగా వివరిస్తూ 10 పేజీల ఎజెండా తయారు చేసి అందజేసారు. అందులో ఎవరు ఏ పని ఎప్పుడు చేయాలి అన్న విషయం పూర్తి గా వివరించబడింది. ఏ పని అయినా ఒక క్రమపద్దతితో, ప్లాన్‌గా చేయడం రఘునాథ్ గారి ప్రత్యేకత.

రఘునాథ్‌గారి కార్యదక్షత మరో మచ్చుతునక "సురభి". 2001 తానా ఉత్సవాల సందర్భంగా వెలువరించిన ఈ పత్రికకు సంపాదకుడుగా వ్యవహరించారు. సంపాదకుడిగానే కాకుండా సర్వం తానే అయి "సురభి"ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. "సురభి" రూపకల్పనలో రఘునాథ్‌గారితో కలిసి పనిచేసిన అనుభవం మరిచిపోలేనిది. 300 పైనే పేజీలు కలిగిన ఈ పుస్తకాన్ని కేవలం ఉబుసుపోకకు చదివి పారేసే పుస్తకంలా కాకుండా, ఎల్లకాలం ఉంచుకోదగ్గ విజ్ఞాన గ్రంథంగా ఈ పుస్తకాన్ని మలిచారు. - ఆంధ్రదేశంలో ప్రముఖులెందరినో సంప్రదించి వారిదగ్గరినుండి చక్కటి పద్యాలను, గద్యాలను రాబట్టి, ఇందులో పొందుపరిచారు. సురభి ఆర్టికల్సు చాలావరకు హైదరాబాద్‌లో టైపు చేయబడ్డావి. ఈమెయిల్లో వచ్చిన వీటిని ఫార్మాట్‌చేయడం, తప్పులు దిద్దడం రఘునాథ్‌గారు చేసారు. సమయం తక్కువగా ఉండడంతో రాత్రిల్లు రెండు, మూడువరకు కూడా సమయం వెచ్చించారు కాని నాణ్యత విషయంలో నిక్కచ్చిగా వ్యవహరించారు. అంతే కాకుండా ఈ లావుపాటి పుస్తకాలు వందకుపైనే హైదరాబాదుకు రవాణాచేసి, అక్కడ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి రచయితలకు ప్రతులు అందజేసారు. అదే సమయంలో అక్కడే ఉన్న నన్ను ప్రముఖులెందరో సరసన స్టేజీపైన కూర్చోబెట్టారు. ఈ సందర్భంగా రఘునాథ్ గారిని సాహితీవేత్తలందరూ ఎంతగానో ప్రశంసించారు.

రఘునాథ్‌గారికి సాహిత్యం అన్నా సాహితీ సమావేశాలన్నా ఎంతో యిష్టం. అడపా దడపా నిర్వహించబడే "సారస్వత సమూహము" లకు తప్పనిసరిగా వచ్చేవారు. అంతే కాకుండా ఏదో ఒకవిషయంపై సోదాహరణ ప్రసంగం చేసేవారు. ఇండియానుండి ఫలానా సాహితీవేత్త వచ్చారు, అతన్ని ఈ సమావేశానికి పిలవండి అని చెప్పేవారు.

కంప్యూటర్ రంగంలో పనిచేయనప్పుడికి రఘునాథ్‌గారు ఆధునిక హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ వాడేవారు. నాలుగు సంవత్సరాల

క్రితంనుండే తన సెల్‌ఫోన్ నుండి లాప్‌టాప్‌కు కనెక్ట్ అయి ఈమెయిల్ చెక్ చేయడం చేసేవారు. ఇండియాలో కూడా పనిచేయాలన్న ఉద్దేశంతో జి.యస్.యం. టెక్నాలజీతో పనిచేసే ఫోన్‌ను ఇందుకై ఉపయోగించేవారు. 1991వ సంవత్సరమునుండే తెలుగు సాఫ్ట్‌వేర్ ను తెలుగుజ్యోతి ప్రచురణకై ఉపయోగిస్తున్నారు. ఒకసారి నాకు తను పది సంవత్సరాలక్రితం వాడిన లాప్‌టాప్ కంప్యూటర్ చూపించారు. అప్పుడప్పుడే ఇవి మార్కెట్లోకి వచ్చాయని చెప్పారు.

ఇలా చెబుతూబోతుంటే రఘునాథ్‌గారి గురించి వందలపుటలు వ్రాసేయవచ్చు.

శ్రీ కిడాంబి రఘునాథ్‌గారు పుణ్యజీవి, ధన్యజీవి, చిరంజీవి.